క్లుప్తంగా

రేపు శివపార్వతుల కల్యాణం

తాండూరు రూరల్: మండల పరిధి బిజ్వార్ గ్రామంలో గురువారం శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు మల్లికార్జున స్వామి దేవాలయ ధర్మకర్త కుర్వ కిష్టయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా ఆలయ 28వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి మొబైల్ అందజేస్తున్న ఎస్‌ఐ గిరి

పెద్దేముల్: పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను పోలీసులు సాంకేతిక సహాయంతో కనుగొని, బాధితుడికి మంగళవారం అందజేశారు. మండల పరిధి జయరాం తండాకు చెందిన పవర్‌గోపాల్ నాయక్, మూడు రోజుల క్రితం తన సెల్ ఫోన్ పోయిందని ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా మొబైల్‌ను ట్రాక్ చేశారు. అనంతరం ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ గిరి ఆధ్వర్యంలో గోపాల్‌కు అందజేశారు.

సీఎం సభను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోస్గి సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం హోదాలో జిల్లా పర్యటనకు రానున్నారని, పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టనున్నారన్నారని పేర్కొన్నారు. అదే విధంగా మధ్యాహ్నం 3గంటలకు కోస్గిలో నిర్వహించే సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. నియోజకవర్గ నాయకులు పట్టణ కేంద్రానికి మధ్యాహ్నం చేరుకుంటే.. ర్యాలీగా సభకు తరలివెళ్దామని కోరారు.

స్వాగత సన్నాహాలు

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారిగా నియోజకవర్గానికి రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం పార్టీ నేతలు నర్సింహులుగౌడ్, ఆవుటి శేఖరయ్య మాట్లాడారు. పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎం రేవంత్.. బుధవారం రానున్నారని తెలిపారు. ఇందులో భాగంగా కోస్గి పట్టణ కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బహిరంగసభ ఉంటుందని, ప్రజలు తరలిరావాలని కోరారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా రాకేష్‌కుమార్



కొడంగల్ రూరల్: బీజేపీ జిల్లా కార్యదర్శిగా సూరారం రాకేష్ కుమార్‌ను నియమించారు. ఈ సదర్భంగా ఆయన ఎన్నిక పట్ల ఆ పార్టీ నాయకులు హర్ష వ్యక్తంచేస్తూ.. మంగళవారం మాట్లాడారు. రాకేష్‌కుమార్ హిందూ వాహిని శాఖలో పనిచేశారని, క్రమశిక్షణతో పనిచేస్తూ ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఆయన మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాని ఆకాంక్షించారు.

శివ భక్తుడి ఇంట్లో పాము



వంట గదిలో పాము

కుల్కచర్ల: శివమాల ధరించిన వ్యక్తి ఇంట్లో నాగుపాము కనిపించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలం బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన మంగళి శివకుమార్ శివమాల వేసుకున్నాడు. మరొకరికి మాలధారణ వేసేందుకు ఇంట్లో సామగ్రి సరిచేస్తున్న క్రమంలో వంటగదిలో పాము కనిపించింది. దీంతో ఆ కుటుంబీకులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇవ్వగా.. వారు సర్పాన్ని పట్టుకుని, అటవీప్రాంతంలో వదిలేశారు.

మూడు రోజులకే బదిలీ

కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ



పెద్దేముల్: మూడు రోజులకే ఎంపీడీఓ హరీశ్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జర్నప్పను నియమించగా.. ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మప్ప బదిలీపై సిద్దిపేటకు వెళ్లగా.. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంలో పనిచేస్తున్న హరీశ్‌ను ఇక్కడికి పంపించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన మూడు రోజులకే.. కమిషనర్ పంచాయత్ రాజ్‌కు ట్రాన్స్‌ఫర్ కాగా.. తాండూరులో మండలంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న జర్నప్పను పెద్దేముల్‌కు బదిలీ చేశారు.

ఓవర్‌లోడ్!

సామర్థ్యానికి మించి టిప్పర్లలో ఎర్రమట్టి తరలింపు

- ధ్వంసమవుతున్న రోడ్లు
- పట్టించుకోని అధికారులు
- అడ్డుకుంటే పోలీసుల అభ్యంతరం



జినుగుర్తి రోడ్డుపై ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఎర్రమట్టి టిప్పర్

తాండూరు రూరల్: అధికలోడ్‌తో వెళ్తున్న వాహనాలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. తాండూరులో అనేక సిమెంట్ కర్మాగారాలు ఉన్నాయి. దీంతో సహజంగానే భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. అయితే ఈ కంపెనీలకు నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లు.. ఎర్రమట్టి (సామర్థ్యానికి మించి లోడుతో)ని జారవేస్తుంటాయి. పైగా టార్పాలిన్లు కప్పకుండానే అవి దూసుకుపోతుండటంతో.. వాటి నుంచి వెలువడిన దుమ్ముతో వెనకాల వచ్చే ఇతర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

తట్టెపల్లి నుంచి..

పెద్దేముల్ మండలం తట్టెపల్లి ప్రాంతాల్లో ఎర్రమట్టి క్వారీలు చాలా ఉన్నాయి. ఇక్కడి నుంచే మట్టిని టిప్పర్ల ద్వారా తాండూరు మండలం మల్కాపూర్ శివారులోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీకి తరలిస్తుంటారు. అయితే ఈ టిప్పర్లు అధిక లోడుతో వేగంగా పరుగులు తీస్తుండటంతో గుండ్ల మడుగు తండా, జినుగుర్తి తండా, జినుగుర్తి ప్రజలు భయందోళన చెందుతున్నారు. వాయు వేగంతో దూసుకెళ్తుండటంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. గతంలో ఓ ఎర్రమట్టి లారీ ఢీకొనడంతో.. పదుల సంఖ్యలో ఆవులు మత్యువాత పడ్డాయని తెలిపారు.

అడిగేనాథుడే లేడు...

అధిక లోడుతో టిప్పర్లు పరుగులు పెడుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. టిప్పర్ల నిండా మట్టిని నింపుకోవటమే కాకుండా.. కనీసం దానిపై టార్పాలిన్ కవర్లను కప్పరని, దీంతో వెనకాల వస్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను స్థానిక యువకులు అడ్డుకుంటే.. పోలీసులతో ఆ యువకులను మట్టి వ్యాపారులు భయాందోళనకు గురి చేయిస్తుంటారని పేర్కొన్నారు. అడ్డుకోవలసిన పోలీసులే.. ప్రజలు అడ్డుకుంటే అభ్యంతరం తెలపడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీఏ, పోలీసులు స్పందించి, ఓవర్ లోడుతో వెళ్తున్న లారీలను అరికట్టాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోరు



నిత్యం మా తండా నుంచి పదుల సంఖ్యలో ఎర్ర మట్టి లోడ్‌తో లారీలు వెళ్తుంటాయి. అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకుపోతుంటాయి. ఉదయం, సాయంత్రం పాఠశాల సమయంలో విద్యార్థులు రోడ్డు దాటాలంటే భయపడుతున్నారు. పోలీసులకు చెప్పినా పట్టించుకోవటం లేదు.

– శంకర్, తండావాసి, గుండ్లమడుగుతండా

నిరంతర శ్రమతోనే విజయం

- చదువును నిర్లక్ష్యం చేయరాదు
- ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి
- వీడ్కోలు సమావేశంలో ప్రిన్సిపాల్ జయదేవ్

అనంతగిరి: 'కష్టపడితే సాధించలేనిదంటూ ఏమీ లేదు. నిరంతరం శ్రమిస్తేనే విజయం మీ సొంతం అవుతుంది. అప్పుడే సమాజంలో మీకంటూ ఒక గుర్తింపు ఉంటుంది' అని ప్రిన్సిపాల్ జయదేవ్ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని సిద్దార్థ జూనియర్ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తుండటంతో పూర్తి సమయాన్ని చదువుకే కేటాయించాలని సూచించారు. జీవితంలో ఇంటర్ విద్య ఎంతో ముఖ్యమని, చదువును నిర్లక్ష్యం చేయరాదని చెప్పారు. ఉన్నతమైన లక్ష్యం ఎంచుకుని, సాధించేవరకు విశ్రమించవద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వేణుగోపాల్, అధ్యాపకులు శివరాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, రామాంజనేయులు, ప్రతాప్‌రెడ్డి, రాములు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నెత్తిన బోనంతో విద్యార్థినులు

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

ఎంపీడీఓ మహేశ్ బాబు



ఎంపీడీఓను సన్మానిస్తున్న ఎంపీటీసీ నవాజ్‌రెడ్డి

దోమ: గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ మహేశ్ బాబు ప్రత్యేక అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిధి దిర్సంపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పారిశుద్ధ్య పనులు, నాలాల పరిశుభ్రత, తాగు నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తడి, పొడి చెత్తను ప్రజలు వేరుగా ఇచ్చేలా దృష్టి సారించి, డంపిగ్ యార్డ్‌కు తరలించాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓను ఎంపీటీసీ నవాజ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శాంతకొండా రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేశ్ తదితరులు ఘనంగా సన్మానించారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోండి

- పారదర్శకంగా ఉపాధి పనుల తనిఖీ
- ఎంపీపీ ప్రభాకర్



ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్

బంట్వారం: జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ప్రభాకర్ సూచించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు సుమారు రూ.7 కోట్లతో చేసిన ఉపాధి పనులపై ఐదు రోజుల పాటు మండలంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఈజీఎస్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ పారదర్శకంగా జరిగిందని చెప్పారు. ఏడాది కాలంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. ఆడిట్‌లో వెలుగు చూసిన చిన్నపాటి లోపాలను సదిదిద్దుకోవాలని సూచించారు. అనంతరం డీఆర్‌ఓలు గ్రామాల వారీగా చేపట్టిన నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సరళ, ఎంపీడీఓ ఎ.రాములు, ఎంపీఓ విజయ్‌కుమార్, ఈజీఎస్ సోషల్ ఆడిట్ అంబుడ్స్‌మెన్ గుర్రం రాములు, రొంపల్లి ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, ఏపీఓ సుధాకర్, ఈసీ శ్రీనివాస్, టీఏలు అశోక్‌రెడ్డి, జంగయ్య, ఎపీఎం భార్గవి, ఎస్ఆర్‌పీ రజిత, ఓపీ అమృత, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలపై దృష్టి పెట్టాలి

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు



కిష్టాపూర్ పాఠశాలలో ఇంటర్నల్ మార్కులను పరిశీలిస్తున్న తనిఖీ బృందం

దోమ: విద్యార్థుల సామర్థ్యాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు (తనిఖీ బృందం) లాల్యానాయక్, శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల పరిధి గుండాల, దాదాపూర్, దిర్సంపల్లి, బడేంపల్లి, కిష్టాపూర్ పాఠశాలలను వారు సందర్శించి, విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా తనిఖీ బృందం సభ్యులు మాట్లాడారు. ప్రత్యేక సాధనతో విద్యార్థులకు బోధన అందిస్తూ, పదిలో మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు చెప్పారు. ఎప్పటికప్పుడూ పరీక్షలు నిర్వహిస్తూ, సామర్థ్యాలను పరిశీలించాలని సూచించారు.

అర్ధరాత్రి వింత శబ్దాలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్: అర్ధరాత్రి వింత శబ్దాలతో గ్రామస్తులు ఉలిక్కి పడ్డారు. నిద్రలోంచి లేచి, ఉరుకులు పరుగులు పెట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి ధర్మాపూర్, టేకుల్‌కోడ్, సంగాయిపల్లి, అంగడిరాయిచూర్ గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి (తెల్లవారితే మంగళవారం) వింత శబ్దాలు వినిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. భూమి నుంచి వస్తున్న వింత ధ్వనులతో భయాందోళనకు గురై రోడ్ల మీదకు పరుగులు తీశామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన మంగళవారం బాధిత గ్రామాలను సందర్శించారు. స్థానికులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. ఏం జరిగిందో తెలియడం లేదని, జరిగిన సంఘటన విచిత్రంగా ఉందని స్థానికులు తహసీల్దార్‌కు వివరించారు.

● విరబూసిన మోదుగు



నరెడ్లగూడలో విరగబూసిన మోదుగుపూత

మండల పరిధిలోని నరెడ్లగూడ, కక్కులూర్, అన్నప్లిగూడ, నాగరకుంట, గ్రామల సమీపంలో విరగబూసిన మోదుగుపూత దృశ్యాలను 'సాక్షి' మంగళవారం కెమెరాలో బంధించింది. మోదుగుపూత ఎర్రగా పూసి చూపరులను ఆకట్టుకుంటుంది. అడవుల్లో రహదారులకు ఇరువైపులా ఆకులు రాలి మోడువారిన మోదుగు చెట్లకు పూసిన పూలు కనువిందు చేస్తున్నాయి. – షాబాద్

మోదీ పాలనలో దేశం అభివృద్ధి

- మారోసారి బీజేపీని ఆశీర్వదించండి
- ఎంపీ బండి సంజయ్, మాజీ ఎంపీ కొండా



ధారూరు: రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

ధారూరు: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతుందని, మరోసారి బీజేపీని ఆదరించండి అని ఆ పార్టీ తెలంగాణ మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. విజయ సంకల్ప బస్సు యాత్రలో భాగంగా మంగళవారం సాయంత్రం ధారూరుకు వచ్చిన వారికి.. ఆ పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బండి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. దేశం కోసం, ప్రజల కోసం నిరంతరం ఆలోచిస్తున్న మోదీని మూడోసారి ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అంబేడ్కర్, బసవేశ్వర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, బీజేపీ నాయకులు పాండుగౌడ్, వివేకానందరెడ్డి, రవీందర్‌గౌడ్, ఎం. రమేశ్, రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమలనాథుల స్వాగతం



పూడూరు: సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

పూడూరు: తాండూరు విజయ సంకల్ప బస్సు యాత్రకు వెళ్తున్న ఎంపీ బండి సంజయ్, కేంద్ర మంత్రి బీఎల్ వర్మ, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డిలకు పార్టీ మండల శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ పరిగి ఇన్‌చార్జి బూనేటి మారుతీకిరణ్, సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, నాయకులు రాఘవేందర్, మాణిక్యం, రాఘవేందర్‌రెడ్డి వెంకటయ్య, రాజు, పాండు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో పనులు ప్రారంభం



శ్మశానవాటికలో నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

వికారాబాద్ అర్బన్: హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధి ధన్నారంలోని శ్మశాన వాటికలో రూ.25 లక్షలతో నిర్మించనున్న రిటైనింగ్ వాల్, తదితర నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, కౌన్సిలర్ రాములు, నాయకులు లక్ష్మణ్, సందీప్, దీపు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



భక్తులను సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: ఆధ్యాత్మికచింతన అలవర్చుకోవడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధి కుల్కచర్ల, కామునిపల్లి గ్రామాలకు చెందిన సూమారు 30మంది భక్తులు, తిరుమల తిరుపతికి పాదయాత్రగా బయల్దేరారు. ఈ సందర్భంగా యాత్ర ప్రారంభించిన శేరిరాంరెడ్డి.. భక్తులను సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, వెంకటయ్య, అంజిలయ్య, రఘు, మల్లయ్య, రాములు, కాంగారి ఆంజనేయులు, బిచ్చయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా యాదగిరి

మోమిన్‌పేట: ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎంపీఓ యాదగిరిని నియమించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ శైలజారెడ్డి, బదిలీపై రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలానికి వెళ్లారు. కాగా జిల్లాకు నూతనంగా నియమించిన ఎంపీడీఓలు ఎవరూ మోమిన్‌పేటకు రాలేదు. దీంతో ఎంపీఓకు ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న రాజేశ్వరమ్మ తదితరులు

దోమ: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. మంగళవారం మండల పరిధి మోత్కూర్‌లో సీసీరోడ్డు పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సంక్షమమే ధ్యేయంగా, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించి, సీసీ నిర్మాణాలు చేపడుతుందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ వార్ల భాస్కర్, గ్రామస్తులు మల్లేశం, ఆనంద్, చెన్నయ్య, రవికుమార్, ఖదీర్, లింగయ్య, సర్దార్, రాఘవేందర్, చంద్రకాంత్, శంకర్, కైసర్, శ్రీనివాస్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ భారతం యువతరానిదే



హైమాస్ట్ లైట్లు అందజేస్తున్న మారుతి కిరణ్

కుల్కచర్ల: యువతకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, భవిష్యత్ భారతం యువతరానిదేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధి ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన యువకులకు వాలీబాల్ కోర్టులో ఏర్పాటు చేసుకునేందుకు హైమాస్ట్ లైట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత వ్యసనాలకు బానిస కావొద్దని, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఆసక్తి గల క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, ఇప్పాయిపల్లి-రాంపూర్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం



మొగులయ్యను సన్మానిస్తున్న నేతలు

కుల్కచర్ల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్ కనకం మొగులయ్యను.. మంగళవారం సంఘం కార్యాలయంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శేరిరాంరెడ్డి మాట్లాడారు. రైతుల అభ్యున్నతికి పార్టీలకు అతీతంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జానకిరాం, ఇప్పాయిపల్లి మాజీ సర్పంచ్ నర్సింహులు, కొండయ్య, కాంగారి ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, రవీందర్, బిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



పూరాతన విద్యుత్‌స్తంభం

తాండూరు రూరల్: విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉందని మండల పరిధి మిట్టబాసుపల్లి గ్రామస్తులు తెలిపారు. మాజీ ఉప సర్పంచ్ గోవింద్ ఇంటి సమీపాన ఉన్న స్తంభం పురాతనమైందని, ఇనుప చువ్వలు తేలి ఉందని, గట్టిగా గాలివీస్తే కూలిపోయే ప్రమాదం లేకపోలేదని స్థానికులు పేర్కొన్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి కొత్త పోల్‌ను ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.